క్లుప్తంగా

నేటి నుంచి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

తిరువూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్లు తిరువూరు ఏడీఏ పద్మ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో బ్రోమోడయోలోన్ మందుతో ఎలుకల నిర్మూలనకు ఎర తయారీ విధానాన్ని రైతులకు తెలియజేస్తామన్నారు. రైతులకు ఎరను ఆర్బీకే సిబ్బంది ఉచితంగా అందజేస్తారని, వీటిని వరి పొలాల్లో, బీడు భూముల్లో ఎలుకల నిర్మూలనకు వినియోగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్లో ఈ క్రాప్ నమోదుకు శుక్రవారంతో గడువు ముగుస్తుందని ఏడీఏ పద్మ తెలిపారు. రైతులు వెంటనే తమ పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు.

విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా ఎంపీపీ మెర్సీవనజాక్షి



విస్సన్నపేట: తిరువూరు డివిజన్ విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యురాలిగా విస్సన్నపేట ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షిని నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి చేతుల మీదుగా ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గురువారం ఆమె అందుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రహదారి సమస్యకు పరిష్కారం



జి.కొండూరు: మండల పరిధి చెర్వుమాధవరం గ్రామ శివారులో రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ఉన్న రహదారి సమస్యపై వివాదం తలెత్తడంతో సబ్కలెక్టర్ అదితి సింగ్ గురువారం రహదారిని పరిశీలించారు. వ్యవసాయ అవసరాలకు ఎటువంటి ఆటంకం ఏర్పడకుండా రాకపోకలు సాగించేలా రైతులతో చర్చించారు. వివాదంలో ఉన్న ఇరు వర్గాల రైతులు సబ్కలెక్టర్ ఆదేశాలను సమ్మతించడంతో రహదారి సమస్యకు పరిష్కారం లభించింది. అనంతరం వెల్లటూరులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సబ్కలెక్టర్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న వైద్య సేవలు, హెల్త్ సర్వే, యాప్ల వినియోగం వంటి అంశాలను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ రోహిణీదేవి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధే లక్ష్యం



ముసునూరు: పాడి రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. పాడి రైతు సంక్షేమమే మన మతం – అలుపెరుగని సేవయే మన అభిమతం కార్యక్రమంలో భాగంగా రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం పాల సొసైటీల కమిటీ సభ్యులు, పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 264 మంది పాడి రైతులకు రూ.4,24,000 బోనస్ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బోర్డు డైరెక్టర్ వెంకట శివజ్యోతి, మేనేజర్ కిరణ్, సంఘాల అధ్యక్షుడు లీలా కోటేశ్వరరావు, ఎం.పద్మ, సూపర్వైజర్లు సారథి, ప్రసాదరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రెడ్డిగూడెం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెడ్డిగూడెం ఎస్ఐ ఎస్.శ్రీను గురువారం పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తరెడ్డిగూడెం సమీపంలోని హెచ్పీ పెట్రోల్ బంక్ వద్ద వ్యాన్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిబ్బందితో కలిసి పట్టుకున్నామన్నారు. ముసునూరు మండలం గొల్లమూడి గ్రామానికి చెందిన లాగు బాలమురళీ అలియాస్ బాలు నాగులూరు పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి విస్సన్నపేట ఏరియాలోని కోళ్ల ఫారాలకు విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. 9 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు బియ్యాన్ని తరలిస్తున్న వాహనం, బాలమురళీని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిని తహసీల్దార్కు రిఫర్ చేశామని చెప్పారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

ముసునూరు: యువకుడు అదృశ్యంపై ముసునూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఎస్ఐ ఎం.కుటుంబరావు చెప్పిన వివరాల ప్రకారం చింతలవల్లి శివారు గోగులంపాడుకు చెందిన గంగుల సత్యనారాయణ కుమారుడు శ్రీనివాసరావు(19) తొమ్మిదవ తరగతి వరకు చదివి, వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈ నెల ఒకటవ తేదీన గడ్డి కోసుకువస్తానని చెప్పి ఇంటి వద్ద నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కాగా ఈనెల 3న ఫోన్ చేసి, బెంగళూర్ నుంచి విజయవాడ వచ్చానని ఇంటికి వచ్చేస్తున్నాను అని చెప్పాడు. కాని అప్పటి నుంచి ఇంటికి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతని తండ్రి బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, రక్షణనిధి
- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



కాచవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, వేదికపై జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి తదితరులు



అక్కపాలెంలో వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

కాచవరం(ఇబ్రహీంపట్నం): ప్రజలకు ఖరీదైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. దీనికి అనుగుణంగా పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష అనే బృహత్తర కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. మండలంలోని కాచవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం ప్రారంభించారు. వైద్యులు ప్రజలకు వైద్య సేవలు అందజేసి మందులు పంపిణీ చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, సర్పంచి ఎం.రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ ముద్దంగుల రంగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ సాంబశివారెడ్డి, దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

ఏ.కొండూరు: ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వేలు నిర్వహిస్తున్నారన్నారు. అవసరమైన వారికి గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ద్వారా రక్త పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. వైద్య శిబిరం గ్రామంలో రెండు రోజులు కొనసాగుతుందని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సూచించారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భూక్య గనియా, సర్పంచి గీతా మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు కాలసాని చెన్నారావు, ఎంపీటీసీ కేసీయా, వైద్యాధికారి స్వాతి, సూపర్వైజర్ మురళీ, ఎంపీటీసీలు, సర్పంచిలు పాల్గొన్నారు.



నర్సింగపాలెంలో మందుల కిట్ను అందజేస్తున్న జెడ్పీటీసీ వీరబాబు తదితరులు

ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

తిరువూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి సూచించారు. మండలంలోని అక్కపాలెంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఈ వైద్య శిబిరాలను నిర్వహించి రోగులకు సత్వర వైద్య సేవలందించడం లక్ష్యంగా కృషి చేస్తోందన్నారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా అందజేస్తున్నారని, స్పెషలిస్ట్ వైద్యులు ఈ శిబిరాల్లో వైద్య పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. ఎంపీపీ గద్దల భారతి, వైస్ ఎంపీపీలు వెంకట నరసమ్మ, రాధాకృష్ణ, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం

కొర్లమండ(విస్సన్నపేట): ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని కొర్లమండ గ్రామ సచివాలయం పరిధిలో స్థానిక ఎంపీయూపీ పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ దేవరం విజయకుమారి, ఎంపీటీసీ నెక్కళపు వసుంధర, సొసైటీ అధ్యక్షుడు దేవరం వెంకటేశ్వరరావు, నాయకులు నెక్కళపు లక్ష్మణరావు, కృష్ణమూర్తి, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

852 మందికి వైద్య పరీక్షలు

చింతలనర్వ(గంపలగూడెం): గంపలగూడెం మండలం చింతలనర్వలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన క్యాంప్లో 852 మంది హాజరై దీర్ఘకాలిక, స్వల్పకాలిక, సీజనల్ వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గంపలగూడెం, ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శృతి, సురేష్, పిల్లల వైద్య నిపుణులు వాసవి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ గద్దల కోటయ్య, ఎంపీటీసీ సభ్యులు జొన్నలగడ్డ మేరీశాంతి, ఎంఈఓ నరసింహారావు, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, ఆశా వర్కర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



కోటపాడులో అంగన్వాడీ స్టాల్ను పరిశీలిస్తున్న దేశిరెడ్డి తదితరులు



చింతలనర్వలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

ఆగిరిపల్లి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు అన్నారు. మండలంలోని నర్సింగపాలెంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు, వైద్యాధికారులు జాస్తి జగన్మోహన్రావు, సునీత, నాయకులు గోళ్ల ఇస్సాకు, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటరత్నం, ఎంపీడీఓ పి.శంకర్రావు, సర్పంచి మొగదాటి అనూష, భాస్కర ప్రసాద్, మొగదాటి పురుషోత్తం, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కోటపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

చాట్రాయి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని కోటపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వైద్యులు కిరణ్మయి, వైష్ణవి, విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్, జ్యోతి, కంటి వైద్యురాలు వరుణ 327 మందికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పరసా సత్యనారాయణ, ఎంపీటీసీలు చెలికాని ఉషారాణి, మోరంపూడి స్వరూపరాణి, తహసీల్దార్ విశ్వనాథరావు, ఎంపీడీఓ దుర్గాప్రసాద్, అంగన్వాడీ సూపర్వైజర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు

కాట్రేనిపాడులో 612 మందికి వైద్య పరీక్షలు

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో సమగ్ర ఆరోగ్య రక్షణ కలుగుతుందని జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్ అన్నారు. తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన గురువారం కాట్రేనిపాడు హైస్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు కరీముల్లా, కిరణ్ కుమార్, ప్రతాప్, ప్రత్యేక వైద్య నిపుణులు ప్రవీణ్, ఎడ్విన్ వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 612 మంది వైద్యసేవలు పొందగా ఎనిమిది మందిని మెరుగైన వైద్యం కోసం నూజివీడుకు రిఫర్ చేశారు. 156 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ఆర్.కృష్ణకుమారి, కె.రాజానాయన ఎనిమిది మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పెదగర్ల స్వరూపరాణి, సర్పంచ్ జి.సుహాసిని, ఎంపీటీసీ ఎస్.నాగమంజుల, సొసైటీ అధ్యక్షుడు యనమదల రాజా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగమల్లేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాంబాబు, ఎంఈఓ బీవీ సుబ్బారావు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

తిరువూరు/విస్సన్నపేట: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. విస్సన్నపేట గ్రామ సచివాలయం–3 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు పీడీఓ వెంకటరమణ గురువారం తెలిపారు. ఈ శిబిరాలను ఎమ్మెల్యే రక్షణనిధి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

దుందిరాలపాడులో..

దుందిరాలపాడు(గంపలగూడెం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం గంపలగూడెం మండల దుందిరాలపాడులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి ప్రాథమికోన్నత పాఠశాలలో శిబిరం జరుగుతుందన్నారు.

నాడు ఆరోగ్యశ్రీ.. నేడు ఆరోగ్య సురక్ష

జి.కొండూరు: నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టి కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందిస్తే నేడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఇంటి వద్దకే అందిస్తున్నారని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వెల్లటూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా వైద్యం

రెడ్డిగూడెం: ఒక్క పైసా ఖర్చు లేకుండా పేదలకు మెరుగైన వైద్య సేవలు దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందజేస్తున్నామని జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి తెలిపారు. మండలంలోని కుదప గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అన్ని రకాల వ్యాధులకు మెరుగైన వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొలగాని తిరుపతిరావు, సర్పంచ్ బొలగాని రాధమ్మ, వైస్ ఎంపీపీ పాటిబండ్ల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాటిబండ్ల సత్యం, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, డాక్టర్ చెన్నకేశవ నాయక్, ఏఎన్ఎం, ఎంఎల్హెచ్పీ, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్యమిత్ర, ఆశ వర్కర్స్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కుదపలో రక్త పరీక్ష చేయించుకుంటున్న జెడ్పీటీసీ విజయభాస్కరరెడ్డి తదితరులు

అధికారులు ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలి

జి.కొండూరు: గ్రామాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా ఆ గ్రామ సర్పంచ్తో పాటు ఎంపీటీసీ సభ్యులకు అధికారులు తప్పనిసరిగా సమాచారం అందించాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ ఆదేశించారు. జి.కొండూరు కమ్యూనిటీ హాల్లో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గతంలో చేసిన తీర్మానాల తాలూకా పనుల పురోగతిపై సమీక్షించారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆయా శాఖల్లో జరుగుతున్న పనులు, సమస్యలపై చర్చించారు. అధికారులు తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలన్నారు. అనంతరం మండల పరిధిలోని చెవుటూరులో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, కందులపాడులో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి రూ.6 లక్షలు, జి.కొండూరు శివాలయం దగ్గర సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, కోడూరులో గ్రావెల్ రోడ్డుకి రూ.2.5 లక్షలు, దుగ్గిరాలపాడు పంచాయతీ కార్యాలయం దగ్గర షెడ్డు నిర్మాణానికి రూ.2 లక్షలు, భీమవరప్పాడులో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి రూ.5 లక్షలు, కవులూరులో బోర్లు, మోటార్లకు రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ ప్రకటించగా సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పుప్పాల సుబ్బారావు, ఈలప్రోలు తేజశ్రీ, ఎంపీడీఓ అనూరాధ, తహసీల్దార్ రోహిణీదేవి, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



జి.కొండూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

విస్సన్నపేట: స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలికను స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లి, వచ్చే సమయంలో స్కూల్ బస్సును వెంబడిస్తూ వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. చాట్రాయి మండలం చనుబండ గ్రామానికి చెందిన యువకుడు చేకు ఈశ్వర్(21) బాలికను వేధిస్తుండడంతో బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ జలాల విడుదల



తిరువూరు: తిరువూరు ఎన్ఎస్పీ మేజరు కాలువకు గురువారం నీటిని విడుదల చేశారు. ఖరీఫ్ పంటల సాగుకు వర్షాభావంతో ఆందోళన చెందుతున్న రైతుల వినతి మేరకు ఎమ్మెల్యే కె.రక్షణనిధి చొరవ తీసుకుని వెంటనే నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా తుమ్మలపల్లి వద్ద తిరువూరు మేజర్ కాలువకు సాగర్ నీటిని విడుదల చేశారు. రైతులు సాగునీటి అవసరాలకు నీటిని వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ కన్వీనర్ చలమాల సత్యనారాయణ కోరారు. నాయకులు పర్యవేక్షించారు.

శ్రీశైలానికి రెండో బస్సు సర్వీసు ప్రారంభం

నూజివీడు: నూజివీడు డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి రెండో బస్సు సర్వీసును గురువారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఒక సర్వీసు శ్రీశైలానికి నడుస్తుండగా ప్రయాణికులు ఆదరించడంతో మరో సర్వీసును ఏర్పాటు చేశారన్నారు. ఈ సర్వీసు ఉదయం 8 గంటలకు నూజివీడులో బయలుదేరి సాయంత్రం 5 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందన్నారు. అలాగే తరువాత రోజు ఉదయం 7.30 గంటలకు శ్రీశైలంలో బయలుదేరి అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు నూజివీడు చేరుతుందన్నారు. బస్సు సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూజివీడు డిపో అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. నూతన బస్సులు తీసుకొచ్చేందుకు ఆర్టీసీ ఎండీతో చర్చిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్, సీఐ రజని, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, నాయకులు కల్లేపల్లి ఆదినారాయణ, షేక్ మస్తాన్, చేబత్తిన మున్నా పాల్గొన్నారు.



నూజివీడులో బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

పాఠశాలలకు సమీపంలో సిగరెట్లు విక్రయిస్తే చర్యలు

నూజివీడు: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు 100 మీటర్ల దూరం వరకు బడ్డీ కొట్లులో, పాన్షాపుల్లో సిగరెట్లు, బీడీలు, పాన్పరాగ్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు రూరల్ సీఐ పీ బాలసురేష్బాబు పర్యవేక్షణలో మండలంలోని పలు గ్రామాల్లో హైస్కూల్లకు సమీపంలోని బడ్డీకొట్లు, పాన్షాపులను సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు తాగడం చట్టప్రకారం నేరమని, అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశంలో పొగతాగుతుంటే ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. తనిఖీల్లో భాగంగా 8 దుకాణాలపై కేసులు నమోదు చేశామని, బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగుతున్న 10 మందికి జరిమానా విధించామని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణదారులకు నోటీసులు

ముసునూరు: విద్యా సంస్థలకు 100 మీటర్ల సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని దుకాణదారులకు పోలీసులు నోటీసులు అందజేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ముసునూరు ఎస్ఐ ఎం.కుటుంబరావు మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలలకు సమీపంలో ఉన్న బడ్డీ కొట్లు, పచారీ దుకాణదారులకు పొగాకు ఉత్పాదకాలైన సిగరెట్, బీడీలు, చుట్టలు, గుట్కా, ఖైనీ వంటి పాన్ మసాలాలు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరిస్తూ గురువారం నోటీసులు అందించారు.

చట్టాలపై అవగాహన అవసరం

నూజివీడు: దేశంలోని చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. సమాచార హక్కు చట్టం–2005 ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మానవ హక్కులకై పోరాడు.. సాధించు ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను గురువారం సబ్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి చట్టాన్ని ప్రజలందరూ తెలుసుకున్నప్పుడే అవి దుర్వినియోగం కాకుండా అమలవుతాయన్నారు. కార్యక్రమంలో మానవ హక్కులకై పోరాడు..సాధించు ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్బాబు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ఆవిర్భవించి 18 ఏళ్లు గడిచినా చట్టం లక్ష్యాలు ఏమాత్రం నెరవేరలేదని, చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ చట్టం గురించి ప్రజలందరికీ క్షుణ్ణంగా అవగాహన కల్పిస్తామని చెప్పారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

ముసునూరు: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఎంఈఓ బీవీ సుబ్బారావు హెచ్ఎంలను ఆదేశించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో అన్ని పాఠశాలల హెచ్ఎంలతో గురువారం సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం, రాగి జావ నాణ్యతతో అందించాలని సూచించారు. నాడు – నేడు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులు యూనిఫామ్, షూస్ తదితరాలను సక్రమంగా ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు దాసు, మోహన్రావు, నాగశిరోమణి, హెచ్ఎంలు పాల్గొన్నారు.



ముసునూరులో హెచ్ఎంలతో మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్బారావు

నాణ్యమైన ఉత్పత్తులు అందించడమే లక్ష్యం

నూజివీడు: దేశంలో తయారవుతున్న వస్తువుల నాణ్యతా ప్రమాణాలను నిర్దేశించే సంస్థ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) అని, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించేలా చూడడమే సంస్థ లక్ష్యమని బీఐఎస్ సీనియర్ డైరెక్టర్, సైంటిస్ట్ ఎఫ్ ఉన్నికృష్ణన్ పేర్కొన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఫ్యాకల్టీకి బీఐఎస్పై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఐఎస్పై అవగాహన, ప్రమాణాలను రూపొందించడం, ప్రమాణాల రూపకల్పనలో పరిశోధన ప్రాజెక్టుల పాత్ర, స్టాండర్డ్స్ క్లబ్ల ఏర్పాటు అంశాలను ఉన్నికృష్ణన్ తదితరులు వివరించారు. కార్యక్రమంలో ట్రిపుల్ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, విజయవాడ బ్రాంచి సీనియర్ డైరెక్టర్, సైంటిస్ట్ ఎఫ్.ఎంఏజే వినోద్, జాయింట్ డైరెక్టర్, సైంటిస్ట్ డీటీ సుజాత, జాయింట్ డైరెక్టర్, సైంటిస్ట్ డి.శుధాంసు రాయ్, సైంటిస్ట్ బీఎం నాగవర్షిణి, ఆర్జీయూకేటీ రీసెర్చ్ సెల్ హెడ్ జి.మోహన్రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో బీఐఎస్ ప్రతినిధులు